కథ

# ఎడ

బి.పి.కరుణాకర్

సమయం ఎంతయి ఉంటుందో తెలియదుగాని చీకటి పడడం మొదలుకాలేదు. వెలుగు తగ్గుతోంది. షాపులో కూర్చుని స్టౌ బాగుచేస్తున్నాను. నా షాపు వీధి చివరన ఉండటాన చీకటి త్వరగా వచ్చేస్తుంటుంది. చాలాసార్లు సాయంత్రం రాకముందే దీపాలు వెలిగించాలని వస్తుంటుంది. దీపం వెలిగిద్దాం అనుకుంటూంటే షాపు ముందు ఖరీదయిన నీలపు రంగు కారు ఆగింది. చుట్టుపక్కల ఇంకొన్ని షాపులున్నాయి. దేనికోసమో వచ్చి ఉండాలి. నాకోసం కార్లు రావు. తలదించుకుని స్టౌ మరామత్తు చేయడంలో మునిగిపోయాను. స్టౌ బాగు చేయడానికి ఇచ్చిన పెద్ద మనిషి మరో ఇరవయి నిమిషాల్లో వస్తాడు.


కారు హారన్ మోగింది. తలెత్తి కారు వంక చూశాను. ముందు తలుపు కిటికీలోంచి గంగాధరం తల బయటపెట్టి నన్ను తన దగ్గరకు రమ్మని చేయి ఊపుతున్నాడు. మరొకరెవరయినా అయి ఉంటే లేచి వెళ్లి ఉండేవాడిని. వాడికోసం చేస్తున్న పని ఆపి లేవబుద్ధికాలేదు. "పనిలో ఉన్నాను. నువ్వే రారా" అన్నాను. నేను తన దగ్గరకు అగ్గగ్గలాడుకుంటూ వెళ్లడానికి ఇష్టపడడంలేదని అర్థమయి ఉండాలి. నేనూ వాడు మాట్లాడుకోవలసినవి ఏమీలేవు. కారు స్టార్టు చేసి రెండు మూడు అడుగులు ముందుకు పోనిస్తోంటే వెళ్లిపోతున్నట్టు అనిపించింది. వెళ్లలేదు. కారాపి, తలుపు తెరిచి, దిగి నేను కూర్చున్న చోటుకు వచ్చాడు. తనను నా దగ్గరకు రప్పించుకున్నాననేమో ముఖం రుసరుసలాడుతోంది. మాలో కొద్దో గొప్పో చదువుకుంది వాడే. నేనూ, శివ, సుగం చాలా గౌరవం ఇచ్చాం. ఆస్ట్రేలియా వెళ్లడానికి వాడికి డబ్బు తక్కువయితే ఏవో తంటాలు పడి సర్దాం, వాడి అమ్మతోపాటు.

నాది చిన్న షాపు. ఎవరినయినా కూర్చోమనడానికి షాపులో ఒక్క కుర్చీ కూడా లేదు. చిన్న ఇనప స్టూళ్లు రెండున్నాయి. మట్టి పట్టి మురికిగా ఉంటాయి. వాటి మీద కూర్చోమన్నా కూర్చోడు. అసలు వాడిని కూర్చోమనడం నాకు ఇష్టం లేదు.

వాడి ముఖంలోకి చూసి, "ఏమిటిలా వచ్చావు?" అడిగాను. ఎందుకు వచ్చి ఉంటాడో నా ఊహకు తడుతోంది. వాడేదో చెప్పబోయేంతలో మరో స్టౌ తీసుకుని ఒకావిడ వచ్చింది. పక్కకు తొలగి నుంచున్నాడు. తొమ్మిదీ తొమ్మిదిన్నర వరకు మరామత్తుల కోసం ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. నేను ఇంటికి చేరుకునేసరికి పదిన్నర దాటుతుంది. కావాలనే ఆమెతో ఎక్కువసేపు మాట్లాడుతూ ఉండిపోయాను. గంగాధర్‌కు అసహనం పెరిగి వెళ్లిపోతాడను కున్నాను. వెళ్లలేదు.

సరిగ్గా నెలా పదిరోజుల కిందట దాదాపు ఇదే సమయంలో రామకృష్ణాపురంలోని గంగాధర్ ఇంటికి వెళ్లినప్పుడు వాచ్‌మేన్ నన్నింట్లోకి వెళ్లనీయలేదు. చిన్న కాయితం మీద నా పేరు రాసి వాచ్‌మేన్‌కు ఇచ్చి పంపించాను. అతను తిరిగి వచ్చి, "సార్‌కిచ్చాను. కొద్దిసేపు ఆగమన్నాడు... ఆగు... కొద్దిగా పక్కగా నిలబడు, కార్లు వస్తుంటాయి." అన్నాడు.

అరగంట నిలబడ్డాను. గంటకు పయిగా నిలబడ్డాను. ఆస్ట్రేలియా నుండి తిరిగివచ్చాడని, మళ్లీ వెళ్లదల్చుకోలేదని విన్నాను కాని ఇంత ఎదిగి ఉంటాడని ఊహించలేదు. నాకు వాడి ఫోను నెంబరుకాని, సెల్ నెంబరుకాని తెలిసి ఉంటే అంతదూరం వెళ్లి వాడింటి ముందు నిలచి ఉండేవాడిని కాదు. వాడి భార్య ఇ.సి.ఐ.ఎల్.లో ఉద్యోగం చేస్తుండగా కంపెనీ వాళ్లే ఆమెను సంవత్సరానికి ఆస్ట్రేలియా పంపించారు. సంవత్సరం అయ్యాక ఆమె అక్కడ వేరే ఉద్యోగంలో చేరి పంపించిన కంపెనీ ఉద్యోగానికి రాజీనామా చేసింది. వీడు బి.హెచ్.ఇ.ఎల్.లో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి పిల్లల్ని తీసుకుని ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడ వీడికేం ఉద్యోగం దొరకలేదు. పిల్లల్ని స్కూలుకు తీసుకువెళ్లడం, తీసుకురావడం, ఇంట్లో వంట చేయడం, లాండ్రీ, డిష్ వాషింగ్ పనుల్లో పడిపోయాడు. వాడి భార్య వీడిని ఒక



దారిలో పెట్టినట్టు అనిపించింది. మొదటిసారి ఇక్కడకు తిరిగి వచ్చినప్పుడు, 'మనల్ని వాళ్లతో కలవనీయరురా, దూరంగానే ఉంచుతారు' అన్నాడు 'ఆ విషయంలో మనమూ తక్కువేం తిన్నామా? మనవాళ్లను మనమే దూరంగా ఉంచుతుంటాం కదా? ఏ దేశమేగినా ఎందుకాలిడినా మన బుద్ధులు మనతో భద్రంగా తీసుకువెళ్తున్నాం కదా?' అన్నాను. ఏం మాట్లాడలేదు.

గంటంబావుకు గంగాధర్ వీధిగుమ్మం వరకు వచ్చి నావంక చూసి చేయి ఊపాడు. నేనూ ఊపాను. నన్ను ఇంట్లోకి రమ్మంటాడని అనుకున్నాను. రమ్మనమనలేదు. వాడయినా బయటకు రాలేదు. లోపల బయటివాళ్లు ఎవరూ ఉన్నట్టు అనిపించలేదు. వాచ్‌మేన్ అన్నట్టు ఏ కారూ రాలేదు. పోర్టికోలో ఒక కారుంది. అది గంగాధర్‌దయి ఉంటుంది. ఇహ నాకు అక్కడ ఉండబుద్ధి కాలేదు. విలువయిన కాలాన్ని వృథా చేసినట్టు అనిపించింది. వచ్చేశాను. ఆ తర్వాత వాడిని మళ్లీ ఇప్పుడే చూస్తున్నాను.

వీలు చూసుకుని, "చెప్పు" అన్నాను.

"ఆమధ్య మా ఇంటికి వచ్చావు. నేను ఉండమన్నా ఉండకుండా వెళ్లిపోయావు..." అన్నాడు.

ఇదొక పచ్చి అబద్ధం.

"రావలసి వచ్చిందిరా" అన్నాను.

వాడిని నేను 'రా' అనడం ఇష్టంగా ఉన్నట్టు అనిపించలేదనుకుంటాను. ముఖం అదోలా పెట్టాడు. ఆ రోజు నేను డబ్బులు కోసం వచ్చి ఉంటానని అనుకుని ఉంటాడు.

"డబ్బులకోసమేమీ కాదురా. అర్జంటు పని మీదే వచ్చాను. పని అయిపోయింది. ఇప్పుడేమో లేదు"

"ఏమిటది?"

వీపు గోడకానించి కూర్చున్నాను. చాలాసేపటి నుండి పనిచేస్తూ ఉండడం వలన నడుం నొప్పిగా ఉంది. నా దగ్గర పనిచేసే కుర్రాడికి వంట్లో బావుండక రాలేదు. తిమ్మిరెక్కిన కాళ్లు ముందుకు చాపాను. మునుపు ఉండేంత ఓపిక ఉండడంలేదు. శక్తి సన్నగిల్లుతోంది.


"యశోదమ్మ తెలుసుకదా...?" ఆగి వాడి ముఖంలోకి చూశాను.

నాకు దగ్గరగా వచ్చి, "మా అమ్మ..." అన్నాడు.

"గుర్తొచ్చింది. మీ అమ్మే. నేను కూడా మీ అమ్మను అమ్మా అని పిలిచేవాడిని. ఆవేళ నేను నీ దగ్గరకు వచ్చిన అరగంటకు ముందు, ఇంట్లోనే, ఎవరితోనో మాట్లాడుతూ, హఠాత్తుగా చనిపోయింది. డాక్టరును తీసుకువచ్చేసరికే దాటిపోయింది. ఆ మాటే నీతో చెబుదామని నీ దగ్గరకు వచ్చాను.... అందుకే, ఇంకెందుకూ కాదు. ఉన్న ఒక్క కొడుకూ రాకపోయినా అందరం కలిసి అన్నీ బాగానే జరిపించాం..." వాడి ముఖంలో ఏ భావం వ్యక్తం కావడంలేదు. గచ్చుపూతలా ఉంది. ఈ విషయం వాడికి తెలియకుండా ఉండే అవకాశం లేదు. మనస్సాక్షి ఉన్నవాడయితే ఆ తర్వాత అయినా, కనీసం దినానికయినా వచ్చి ఉండవలసింది. ఎందుకు రాలేదో నేను అడగదల్చుకోలేదు. అథవా అడిగినా సరయిన జవాబు వస్తుందని నేను అనుకోను.

కనిపెంచింది కాబట్టి వాడి గురించి మాకన్నా ఆమెకు బాగా తెలిసి ఉండాలి. అందుకనేమో వాడి నుండి ఏమీ ఆశించలేదు. ఎవరినీ ఏమీ అడిగేది కాదు. ఆమెకు వచ్చే పింఛనుతో,

**ఆవేళ నేను నీ దగ్గరకు వచ్చిన అరగంటకు ముందు, ఇంట్లోనే, ఎవరితోనో మాట్లాడుతూ, హఠాత్తుగా చనిపోయింది. డాక్టరును తీసుకువచ్చేసరికే దాటిపోయింది. ఆ మాటే నీతో చెబుదామని నీ దగ్గరకు వచ్చాను.... అందుకే, ఇంకెందుకూ కాదు. ఉన్న ఒక్క కొడుకూ రాకపోయినా అందరం కలిసి అన్నీ బాగానే జరిపించాం...**



సరిపోకపోయినా చివరి వరకు నవ్వుతూ నెట్టుకుంటూ వచ్చింది. వాడు మొదటిసారి ఆస్ట్రేలియా వెళ్తున్నప్పుడు వాడికి డబ్బులు సరిపోతాయో, లేదేమోనని ఉన్న పెంకుటిల్లు తాకట్టు పెట్టి కొంత తీసుకొచ్చి వాడికి ఇచ్చింది. ఆ ఇల్లు తాకట్టులోంచి అటే వెళ్లిపోయింది. మా ఇంటికి దగ్గరగా ఉన్న అద్దె ఇంట్లో ఉంటూ తనూ వెళ్లిపోయింది.

పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని మౌనంగా ఉన్నాడు. అవసరం వాడిదయితే చాలా వినయంగా ఉంటాడు.

చిన్నగా దగ్గి, "మా అమ్మకు ఒక బంగారపు గొలుసు, దుద్దులు, రెండు జతల గాజులు, ఒక ఉంగరం ఉండాలి. వాటి గురించి... నీకేమయినా... తెలుసా?" నెమ్మదిగా అడిగాడు.

గద్దరెక్కలు టపటప కదిలినట్టు అనిపించాయి. కోపం తన్నుకొస్తోంది. తరతరాలుగా స్త్రీని దోపిడి చేయడం సొంతవారి నుండే మొదలయి సంస్కృతిగా మారిపోయింది.

ఎదురుగా ఉన్న స్టౌ ఎత్తి వాడి ముఖం మీద పడేలా విసిరాను.